వైభవంగా దుర్గామాత నిమజ్జనోత్సవం

- కోలాహలంగా విగ్రహాల శోభాయాత్ర
- ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా మహిళల కలశ యాత్ర
- తుంగా తీరంలో శోభాయమానంగా నిమజ్జనోత్సవం


ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


దుర్గమ్మ విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం


తుంగభద్ర నదిలో దుర్గమ్మ విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న దుర్గామాత విగ్రహాల నిమజ్జనోత్సవం తుంగభద్రా నది సంకల్‌బాగ్ దుర్గాఘాట్‌లో శోభాయమానంగా జరిగింది. ఆదివారం గీతా ప్రచార సమితి, దుర్గామాత విగ్రహాల నిమజ్జనోత్సవ సమితి, టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు, కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి గంగమ్మకు పూజలు నిర్వహించారు. మొదటిసారి ఏర్పాటు చేసిన రావణ దహనం కార్యక్రమాన్ని నిర్వహించి దుర్గా మాత విగ్రహానికి పూజలు నిర్వహించి నిమజ్జనాన్ని ప్రారంభించారు. మంత్రి భరత్, టీజీ వెంకటేష్, మేయర్ రామయ్య మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనోత్సవం మాదిరిగానే దుర్గా మాత నిమజ్జనోత్సవం కనులపండువలా నిర్వహించడం మంచి పరిణామం అన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించేందుకు 23 ఏళ్ల కిందట దుర్గామాత విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. అమ్మవారి దయతో జిల్లాలో మంచి వర్షాలు కురవాలని రైతులు పాడి పంటలతో తులతూగాలని ఆకాంక్షించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడారు.

కనులపండువలా శోభాయాత్ర

నగరంలోని వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన దుర్గామాత విగ్రహాల శోభాయాత్ర వైభవంగా సాగింది. మహిళలు అధిక సంఖ్యలో బోనాలతో ఊరేగింపులో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కోలాటాలు, భజనలతో నగరంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి శిష్య బృందం నిర్వహించిన తుంగా హారతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో డ్యాన్స్ మాస్టర్ కరీముల్లా, సంగీతం టీచర్ నాగమల్లీశ్వరి శిష్య బృందం ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. తుంగభద్రా నదితో పాటు, కేసీ కెనాల్ వినాయక ఘాట్‌లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గీత ప్రచార సంఘం అధ్యక్షుడు రమణయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు టీసీ మద్దిలేటి, కార్పొరేటర్లు పరమేశ్, కృష్ణకాంత్, దుర్గా ఉత్సవ సమితి ప్రతినిధులు ఎలమర్తి రమణయ్య, విఠల్‌శెట్టి, మహాబలేష్, హనుమంతరావు, దాశెట్టి శ్రీనివాసులు, విద్యావేత్త జి.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


కళాకారులతో మంత్రి భరత్, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, మేయర్ బీవై రామయ్య తదితరులు


హాజరైన వివిధ సంస్థల ప్రతినిధులు

క్లుప్తంగా

ఆర్థరైటిస్‌పై అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ సృజన

కర్నూలు(హాస్పిటల్): ఆర్థరైటిస్ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన పెరగాలని రుమటాలజిస్టు డాక్టర్ ఎ.సృజన చెప్పారు. ప్రపంచ ఆర్థరైటిస్ డేను పురస్కరించుకుని శనివారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో 18 కోట్లకు పైగా ప్రజలు ఆర్థరైటిస్ సమస్యతో బాధపడుతున్నారన్నారు. ఆర్థరైటిస్‌లో రెండు రకాలుంటాయని, వృద్ధాప్యంలో మోకాలు, తుంటి కీళ్ల అరగడం వల్ల ఆస్టియో ఆర్థరైటిస్, రోగనిరోధక శక్తి ఎదురు తిరగడం వల్ల కీళ్ల దగ్గరున్న కణాలన్నీ ఇన్‌ఫ్లమేషన్‌కు గురై వాచిపోతాయని దీనినే రుమటాయిడ్ ఆర్థరైటిస్ అంటారని వివరించారు. ఇందులో చేతుల వేళ్లు, మణికట్టు, కాళ్లు, కీళ్ల భాగాలతో పాటు శరీరంలోని ఇతర కణజాలాలు, కండరాలపై దీని ప్రభావం ఉంటుందని చెప్పారు. దీంతో పిత్తాశయం, ఊపిరితిత్తుల సమస్యలతో పాటు రక్తహీనత, లో బీపీ, మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయన్నారు. ఇన్‌ఫెక్షన్ల కారణంగా సొరియాటిక్, సెప్టిక్, థంబ్ వంటి ఇతరత్రా ఆర్థరైటిస్ వ్యాధులూ వస్తుంటాయని చెప్పారు.

నగరంలో 'పొట్టేల్' బృందం సందడి


కొండారెడ్డి బురుజు వద్ద పొట్టేల్ సినిమా యూనిట్

కర్నూలు కల్చరల్: నగరంలో పొట్టేల్ సినిమా బృందం సందడి చేసింది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం కొండారెడ్డి బురుజు వద్ద హీరో యువ చంద్రకృష్ణ పొట్టేలును పట్టుకొని అలరించారు. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు పడే కష్టాన్ని ఈ సినిమాలో చూపించామని హీరో వెల్లడించారు. యువతకు కావాల్సిన అన్ని అంశాలను దర్శకుడు సాహిత్ చక్కగా చిత్రీకరించారన్నారు. చిత్రంలో అనన్య నాగేళ్ల హీరోయిన్‌గా ఆకట్టుకుంటుందన్నారు. నిషా ఎంటర్‌టైన్‌మెంట్స్, ప్రజ్ఞా సన్నిధి క్రియేషన్స్‌లో కె.నిషాంక్ రెడ్డి, ఎస్.సురేష్‌కుమార్ సినిమా రూపొందించారన్నారు. శేఖర్ చంద్ర సంగీతం అందించారని చెప్పారు. చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా మృతికి సంతాపం

కర్నూలు(సెంట్రల్): ఢిల్లీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ సాయిబాబా అనారోగ్యంతో మృతి చెందడం అణగారిన వర్గాల ప్రజలు, ప్రజాస్వామిక వాదులకు తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయిబాబా మృతికి సీపీఐ జిల్లా సమితి తరపున ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. సాయిబాబాకు మావోయిస్టులతో సంబంధాలుఉన్నాయన్న ఆరోపణలతో బీజేపీ ప్రభుత్వం అక్రమంగా 9 సంవత్సరాలు జైల్లో పెట్టిందని, అప్పుడే ఆయన ఆరోగ్యం దెబ్బ తిన్నదని, ఆ కారణంతోనే బయటకు వచ్చిన తర్వాత కోలుకోలేక మృతి చెందినట్లు భావిస్తున్నామన్నారు. నిరంకుశ మోదీ ప్రభుత్వానికి కూడా రోజులు దగ్గర పడ్డాయని, మోదీ చర్యలను దేశం గమనిస్తోందని పేర్కొన్నారు.

17న ఓపెన్ కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: మండలంలోని కోయిలకొండ గ్రామంలో వాల్మీకి జయంతి సందర్భంగా ఈ నెల 17వ తేదీన అంతర్‌రాష్ట్ర ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. గెలుపొందిన జట్లకు దాతల సహకారంతో వరుసగా రూ. 30వేలు, రూ. 20వేలు, రూ.10వేలు, రూ. 5 వేలు అందజేస్తామని చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 16న ఉదయం 9 గంటలలోపు రూ. 500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 9493686207, 6300364569 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆర్‌యూలో కొండచిలువ


న్యూ లైబ్రరీ బిల్డింగ్ ఎదుట కనిపించిన కొండచిలువ

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఆదివారం రాత్రి కొండచిలువ భయభ్రాంతులకు గురిచేసింది. న్యూ లైబ్రరీ బిల్డింగ్ ముందు చాలా సేపు కదలాడుతూ లైబ్రరీ పక్క నుంచి డేటా సైన్స్ గది వైపు వెళ్లింది. ఇది చాలా రోజుల నుంచి వర్సిటీలో తిరుగుతుందని విద్యార్థులు చెబుతున్నారు. వర్సిటీ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదంటూ వాపోతున్నారు. వర్సిటీ వసతి గృహాలు, తరగతి గదుల పరిసర ప్రాంతాల్లో గడ్డి, పిచ్చి మొక్కలు ఉండటంతో పాములు సైతం తిరుగుతున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. కొండ చిలువ వచ్చిన సమయంలో వర్సిటీకి సెలవులు కావడం, విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. వర్సిటీ అధికారులు స్పందించి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇస్తే వారు కొండచిలువను పట్టుకొని అడవికి తరలిస్తారని విద్యార్థులు పేర్కొంటున్నారు.

ఇస్కాన్‌లో భగవద్గీత తరగతులు


ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ దేవతా మూర్తులు

కర్నూలు కల్చరల్: కర్నూలు ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం శీల ప్రభుపాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణా తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు సందేశమిచ్చారు. ప్రతి ఒక్కరూ నిత్యం భగవద్గీత పఠనం, శ్రవణం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఉత్తమ సమాజ నిర్మాణానికి భగవద్గీత ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. హరే రామ హరే కృష్ణ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. అనంతరం శీల ప్రభుపాదుల ప్రేమ విందు జరిగింది. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా

గోనెగండ్ల : మండలంలోని వేముగోడు గ్రామ సమీపంలో తెలంగాణకు చెందిన కారు శనివారం ఉదయం అదుపు తప్పి గుంతలో పడింది. తెలంగాణకు చెందిన చంద్రశేఖర్ తన కారులో సొంత పనుల నిమిత్తం ఆదోని పట్టణానికి వెళ్తుండగా.. వేముగోడు గ్రామ సమీపంలోకి రాగానే రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించబోయి కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గోతిలో బోల్తా పడింది. ప్రమాదంలో కారులో ఉన్న చంద్రశేఖర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో గమనించిన స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. కోడుమూరు నుంచి ఎమ్మిగనూరు వరకు ప్రధాన రహదారి గుంతలు పడి అధ్వానంగా తయారైంది. దీంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రభుత్వం స్పందించి రోడ్డు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విజయ దశమి సంబరాలు


లలితా పీఠంలో అమ్మవారు


నెహ్రూనగర్ ఆలయంలో..


ఇతాండ్రపాడు గ్రామంలో..


ఓల్డ్‌సిటీ రామాలయంలో కన్యపూజ


కాళికాంబ ఆలయంలో అమ్మవారు


సూర్య నారాయణ స్వామి ఆలయంలో..


పల్లకీ సేవలో ఎస్వీ మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు


ఓల్డ్‌సిటీ మహాలక్ష్మీ ఆలయం వద్ద శమీ వృక్షపూజకు తరలి వచ్చిన భక్తులు

కర్నూలు కల్చరల్: జిల్లావ్యాప్తంగా శనివారం విజయ దశమి సంబరాలు అంబరాన్నంటాయి. దసరా రోజు నిర్వహించే శమీ వృక్ష పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నవరాత్రుల్లో వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్న అమ్మవారికి దశమి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం బంధు మిత్రులు, కుటుంబ సభ్యులందరూ అమ్మవారి ఆలయాలు, ఇతర ప్రాంతాల్లో ఉన్న శమీ వృక్షాల వద్దకు చేరుకుని పూజలు చేశారు. జమ్మి చెట్టు చుట్టూ తొమ్మిది ప్రదక్షిణలు చేసి జమ్మి పత్రాలను తల్లిదండ్రులకు, పెద్దవారికి అందజేసి పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. దేవరగట్టులో కర్రల సమరం, ఆదోనిలో రావణ కుంభకర్ణుల బొమ్మల దహనం, మద్దికెరలో గుర్రాల పార్వేట ఉత్సవం, ఎమ్మిగనూరు మండలం గుడేకల్లులో యువత సాహస విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవాల్లో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలోని కర్నూలుతో పాటు, నంద్యాల, శ్రీశైలం, మహానంది, అహోబిలం, ఆదోని, నందవరం, మంత్రాలయం, డోన్, బేతంచర్ల, నందికొట్కూరు, ఆత్మకూరు, పత్తికొండ, కల్లూరు, కోడుమూరు తదితర ప్రాంత్రాల్లో దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. కర్నూలు పాతనగరంలోని జమ్మిచెట్టు, బీక్యాంప్ రాజరాజేశ్వరి దేవి ఆలయం, జిల్లా గో రక్షణశాల, వీకర్ సెక్షన్‌కాలనీ, బుధవారపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సమీపం, సీక్యాంప్‌లోని టీటీడీ కల్యాణ మండపం ఆవరణ, మెడికల్ కాలేజ్ మైదానం, అశోక్ నగర్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, పాతనగరం నగరేశ్వర స్వామి ఆలయం, పాత కల్లూరు, లలితా పీఠం, సూర్యనారాయణ స్వామి ఆలయం, సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయాల్లో వేడుకలు విశేషంగా జరిగాయి. పల్లకీ సేవలు, రథోత్సవాలు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి, బీజేపీ నాయకులు కగ్గోలు హరీష్ బాబు, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి ఓల్డ్‌సిటీలోని జమ్మిచెట్టు వద్ద శమీ వృక్ష పూజలో పాల్గొని ప్రసంగించారు. రాజస్థాన్ విష్ణు సమాజ్ సంఘ్ వారు భారీ ఊరేగింపు నిర్వహించారు. సంఘ్ సభ్యులు, బీజేపీ నాయకులు వేడుకల్లో పాల్గొన్నారు.


నిమిషాంబ దేవి ఆలయంలో..


వీకర్ సెక్షన్ కాలనీలో..

భక్తిశ్రద్ధలతో జమ్మిచెట్టుకు పూజలు


శమీ వృక్షానికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో శనివారం విజయదశమి వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు శమీ చెట్టుకు ప్రత్యేక శ్రద్ధలతో పూజలు చేశారు. కల్లూరు అర్బన్ పరిధిలోని కల్లూరు, వీకర్‌సెక్షన్ కాలనీ, గణేష్‌నగర్‌లో అమ్మవార్లకు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పూజలు చేశారు. అనంతరం దేవి శరన్నవరాత్రిలో భాగంగా జమ్మి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ప్రజలందరూ సుఖ సంతోషలతో ఉండాలని కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వర్సిటీల పునఃప్రారంభం

కర్నూలు కల్చరల్: దసరా పండుగ సెలవుల అనంతరం జిల్లాలోని యూనివర్సిటీలు సోమవారం పునఃప్రారంభం కానున్నాయి. రాయలసీమ యూనివర్సిటీ, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీల్లో సోమవారం నుంచి తరగతులు మొదలవుతాయని ఆయా వర్సిటీల రిజిస్ట్రార్‌లు డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ వి.లోకనాథ తెలిపారు.

నేడు మద్యం దుకాణాలకు లాటరీ

కోడుమూరు రూరల్: మద్యం దుకాణాల కోసం టెండర్లు వేసి ఎదురు చూస్తున్న ఆశావాహుల నిరీక్షణ సోమవారం ఫలించనుంది. ఉదయం కర్నూలు జిల్లా పరిషత్‌లో నిర్వహించనున్న లాటరీలో దరఖాస్తుదారుల భవితవ్యం తేలబోతుంది. మద్యం దుకాణాల దరఖాస్తుకు ప్రభుత్వం నాన్ రిఫండబుల్ ఫండ్ రూ.2లక్షలు పెట్టినా ఆశావాహులు ఏమాత్రం తగ్గలేదు. ఒక్కొక్కరు నాలుగైదు దరఖాస్తులను వేయడం గమనార్హం. కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 14మద్యం దుకాణాలకు సంబంధించి మొత్తం 510 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోనే కోడుమూరు కర్నూలు తర్వాత రెండవ స్థానంలో నిలిచింది. స్టేషన్ పరిధిలోని కోడుమూరు మండలంలో మొత్తం 5మద్యం దుకాణాలకు 150దరఖాస్తులు, గూడూరులోని 3మద్యం దుకాణాలకు 153దరఖాస్తులు, ఇందులో 34వ దుకాణానికి ఏకంగా 99దరఖాస్తులు రావడం గమనార్హం. అలాగే వెల్దుర్తిలోని 3దుకాణాలకు 109 దరఖాస్తులు, సి.బెళగల్‌లోని రెండు మద్యం దుకాణాలకు 84, క్రిష్ణగిరిలోని ఒక మద్యం దుకాణానికి 14దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ మంజుల ఆదివారం వివరాలు వెల్లడించారు.

▶ ఇక్కడున్న ఎండీయూ వాహనాలు కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని వడ్డెగేరి, కుమ్మరిగేరిలో ప్రజలకు ఇంటింటా బియ్యాన్ని సరఫరా చేసేందుకు ఏర్పాటుచేసినవి. అయితే ఆ వాహనాల్లో బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు లేవు. మరీ వినియోగదారులకు సరకులు ఎలా సరఫరా చేస్తారనే సందేహం వస్తుందా? మీ సందేహం నిజమే. ఈ వాహనల ద్వారా సరుకులను సరఫరా చేయడం లేదు. కేవలం వినియోగదారుల నుంచి వేలిముద్రలు తీసుకుని డబ్బులు ఇచ్చి పంపుతారు.

▶ వన్ టౌన్ ఏరియాలోని గీతా మందిరం సమీపంలో ఆగి ఉన్న ఎండీయూ వాహనం ద్వారా ఆ ప్రాంత ప్రజలకు బియ్యానికి బదులుగా డబ్బులు ఇచ్చి పంపుతున్న దృశ్యం ఇది. ఇలా కేఎంసీ పరిధిలో ఎండీయూ వాహనాల ద్వారా బియ్యానికి బదులుగా వినియోగదారులకు నేరుగా డబ్బులుఇచ్చి వేలిముద్రలు తీసుకొని పంపుతున్నారు. అయితే పర్యవేక్షణ చేయాల్సిన పౌరసరఫరాల శాఖ నిద్రపోతోంది. కొందరు అధికారులు వారిచ్చే మామూళ్లకు మరిగి జేబులు నింపుకుంటున్నారు.

రేషన్ బియ్యం పక్కదారి

- కేఎంసీ పరిధిలో ఎండీయూ ఆపరేటర్లే వినియోగదారుల నుంచి బియ్యం కొనుగోలు
- పట్టించుకోని పౌర సరఫరాల శాఖ అధికారులు
- 67 వాహనాల ద్వారా 1.12 లక్షల కార్డులకు నిత్యావసరాల సరఫరా




వన్‌టౌన్ గీతామందిరం సమీపంలో రేషన్ వాహనం వద్ద వినియోగదారులు, కుమ్మరి గేరిలో ఖాళీగా ఉన్న రేషన్ వాహనం

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగర పరిధిలో 67 వాహనాల ద్వారా ప్రజలకు నిత్యావసర సరకులను సరఫరా చేసేవారు. దాదాపు 1.12 లక్షల మంది కార్డుదారులకు డోర్ డెలివరీ ద్వారా బియ్యం, ఇతర సరకులను సరఫరా చేయాల్సి ఉంది. అయితే పౌర సరఫరాల శాఖ పర్యవేక్షణను గాలికి వదిలివేయడంతో ఎండీయూ ఆపరేటర్లే నేరుగా వినియోగదారుల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. కేజీ బియ్యం రూ.10కి తీసుకొని అక్రమ సంపాదనకు అలవాటు పడ్డారు. మందలించాల్సిన అధికారులే వారితో కుమ్మక్కయ్యారు. అక్రమ సంపాదనలో పౌరసరఫరాల శాఖ అధికారులు కూడా వాటాలు పంచుకుంటున్నారు. ఎవరైనా ఏమైనా అంటే తమకు ఫిర్యాదులు ఏమీ రాలేదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ చేస్తామని పౌర సరఫరాల శాఖాధికారులు చెబుతుండడం విశేషం.

బియ్యం కావాలని అడిగినా లెక్కచేయడం లేదు

కొందరు వినియోగదారులు తమకు బియ్యం కావాలని అడుగుతున్నా లెక్క చేయడం లేదు. డబ్బులు ఇస్తాం తీసుకుంటే తీసుకో.. లేదంటే లేదు అన్నట్లు బెదిరిస్తున్నారు. దీంతో బియ్యం అవసరం ఉన్నా విధిలేని పరిస్థితుల్లో డబ్బులు తీసుకోవాల్సి వస్తోందని చాలా మంది రేషన్‌కార్డు దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా ఏమైనా అంటే వారే బిగ్గరగా మాట్లాడి భయపెడుతున్నారు. ఇచ్చే రేటు కూడా అతి తక్కువగా రూ.10 మాత్రమే ఇస్తున్నారు. కొంచెం రేటు పెంచమని అడిగినా పెంచడం లేదు. దీంతో వినియోగదారులు రెండింటికీ చెడ్డ రెవడిలా తయారయ్యారు.

పర్యవేక్షణ పెంచుతాం



రేషన్ బియ్యాన్ని ఎవరూ కొనుగోలు చేయరాదు. వినియోగదారులు అమ్మకూడదు. అయితే ఎండీయూ వాహనాల్లోనే బియ్యం కొనుగోలు చేస్తుండడంపై మా దృష్టికి రాలేదు. పర్యవేక్షణ పెంచి బియ్యం కొనుగోళ్లపై నిఘా ఉంచుతాం. ప్రత్యేక బృందాలను నియమించి దాడులు చేయిస్తాం. ఎండీయూ ఆపరేటర్లు బియ్యాన్ని కొనుగోలు చేస్తే విధుల నుంచి తొలగిస్తాం. – రాజారఘువీర్, డీఎస్‌ఓ, కర్నూలు